# ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి

కామారెడ్డి, మే 12 : ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ ఆయా శాఖల అధికారులకు సూచించారు. కామారెడ్డి సమీకృత కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. ప్రజావాణిలో భూ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వచ్చే ఫిర్యాదులను రెవెన్యూ అధికారులు తక్షణమే పరిష్కరించాలన్నారు. ప్రజావాణిలో 76 వినతులను స్వీకరించామని తెలిపారు. జిల్లా అదనపు కలెక్టర్ చందర్, ఆర్డీవో వీణ, పలు శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

**విద్యార్థులను అభినందించిన కలెక్టర్**

జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా స్థాయిలో పదోతరగతిలో అగ్రస్థానంలో నిలిచిన విద్యార్థులను కలెక్టర్ అభినందించారు. జడ్పీహెచ్ఎస్ కల్వరాల్ పాఠశాల పదోతరగతి విద్యార్థిని భావిక 600 మార్కులకు గాను 581 మార్కులు సాధించిన విద్యార్థినిని శాలువా, బొకేలతో సత్కరించారు. కార్యక్రమంలో డీఈవో రాజు, ఏసీఈ బలరాం, జడ్పీహెచ్ఎస్ కల్వరాల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విష్ణువర్ధన్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

## మురళీ నాయక్‌కు నివాళి



ఎల్లారెడ్డిలోని పోచమ్మ ఆలయంలో మురళీ నాయక్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న యువకులు, వ్యాపారులు

ఎల్లారెడ్డి రూరల్, మే 12 : జవాన్ మురళీ నాయక్ వీరమరణం పొందడంతో దేశం నీ ప్రాణత్యాగాన్ని ఎన్నటికీ మరవబోదని, మురళీ నాయక్ అమర్ రహే అంటూ పట్టణానికి చెందిన పలువురు యువకులు, వ్యాపారులు సోమవారం నివాళులర్పించారు. ఎల్లారెడ్డి పట్టణంలోని పోచమ్మ ఆలయంలో పలువురు యువకులు, వ్యాపారులు ఆపరేషన్ సిందూర్‌లో వీరమరణం పొందిన ఆంధ్రప్రదేశ్ సత్యసాయి జిల్లాకు చెందిన మురళీ నాయక్‌కు అశ్రునివాళులర్పించారు. ఆయనతోపాటు పలువురు జవాన్లు మృతిచెందడం అత్యంత బాధాకరమైన విషయమన్నారు. వీరుని మరణం ఎన్నటికీ వృథా కారాదని, యుద్ధంలో మరణించిన వీరి ఆత్మలకు శాంతి చేకూరాలంటే పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను కేంద్రం తిరిగి స్వాధీనం చేసుకోవాలన్నారు. అప్పటివరకు ఆపరేషన్ సిందూర్‌ను ఆపవద్దని, కొనసాగించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పట్టణానికి చెందిన పలువురు వ్యాపారులు, యువకులు, స్థానికులు తదితరులు ఉన్నారు.

## సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం హర్షణీయం



మాట్లాడుతున్న ఏఎస్పీ చైతన్య

కామారెడ్డి, మే 12 : జిల్లా కేంద్రంలోని ఇందిరానగర్ కాలనీలో ఉన్న డబుల్ బెడ్రూం సముదాయంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఏఎస్పీ చైతన్య సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం హర్షణీయమని అన్నారు. మధ్య తరగతికి చెందిన ప్రజలు ముందుకు వచ్చి సుమారు రూ.2 లక్షలతో 30 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమని అన్నారు. ఒక్క కెమెరా 100 మంది పోలీసులతో సమానమని చెప్పారు. ప్రతి కాలనీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడానికి దాతలు ముందుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్సై శ్రీరామ్, సిబ్బంది కమలాకర్ రెడ్డి, విశ్వనాథ్, అజర్, సంపత్, నర్సారెడ్డి, కాలనీ వాసులు రాజు, మజాహెద్, షాదుల్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## కుట్టు మిషన్ అందజేత



కుట్టు మిషన్ అందజేస్తున్న ఏపీవో

మాచారెడ్డి, మే 12 : మండల కేంద్రంలో గ్రామ స్వరాజ్య సంస్థ జిల్లా కో-ఆర్డినేటర్ రంగ వెంకటలక్ష్మి శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గ్రామ మహిళలకు స్వయం ఉపాధి కల్పించేందుకు 30 రోజులపాటు 35 మందికి ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించామని అన్నారు. సబ్సిడీపై కుట్టు మిషన్ పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీవో సాయిబాబా, పంచాయతీ కార్యదర్శి ఆస్మా పాల్గొన్నారు.

**శిక్షణ ప్రారంభం..**

నిజాంసాగర్, మే 12 : మహ్మద్‌నగర్‌లోని గ్రామ స్వరాజ్య సంస్థ ఆధ్వర్యంలో ఉచిత కుట్టు మిషన్ శిక్షణను తహసీల్దార్ సవాయిసింగ్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ స్వరాజ్య సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మార్కెట్‌లో ప్రస్తుతం కుట్టు మిషన్ రూ.10 వేలు ఉన్నదని, కానీ.. ఇక్కడ 6,500 రూపాయలకే అందజేస్తున్నారని తెలిపారు. జిల్లా కోఆర్డినేటర్ రంగ వెంకట లక్ష్మి, ఐకేపీ ఏపీఎం రామ్‌నారాయణ గౌడ్, సెక్రటరీ ప్రేమ్‌సింగ్, కారోబారి అంబయ్య, మండల కోఆర్డినేటర్ నవ్య తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం తడవకుండా టార్పాలిన్లు కప్పాలి

ఎల్లారెడ్డి రూరల్, మే 12: అకాల వర్షాలకు ధాన్యం తడవకుండా ఉండడానికి రైతులు అప్రమత్తంగా ఉండి ఎప్పటికప్పుడూ టార్పాలిన్లు కప్పాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ సురేశ్ సూచించారు. ఎల్లారెడ్డి పట్టణంలోని ఏఎంసీ మార్కెట్‌లో ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, లింగారెడ్డిపేట్, శివ్వానగర్ కొనుగోలు కేంద్రాలను ఆయన సొసైటీ సీఈవో విశ్వనాథంతో కలిసి సోమవారం పరిశీలించారు. 17శాతం మాయిశ్చర్ మించకుండా చూసుకొని, ధాన్యాన్ని వెంటనే లోడ్‌చేసి రైస్‌మిల్‌కు తరలించాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కాంటా చేయడంలో వేగం పెంచాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లోని పరిస్థితిపై ఆయన రైతులతో సమీక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయనతోపాటు ఆయా కొనుగోలు కేంద్రాల సిబ్బంది, రైతులు ఉన్నారు.



శివ్వానగర్‌లో ధాన్యం లోడ్ లారీని పరిశీలిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ సురేశ్

## సేవా గుణానికి నిలువెత్తు రూపం నర్సు



ఎల్లారెడ్డి ప్రభుత్వ దవాఖానలో అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా నివాళులర్పిస్తున్న సిబ్బంది

ఎల్లారెడ్డి రూరల్, మే 12: సేవా గుణానికి నిలువెత్తు ప్రతిరూపం నర్సు ఉద్యోగం అని ఎల్లారెడ్డి మాజీ మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ కొనియాడారు. ఎల్లారెడ్డి ప్రభుత్వ దవాఖానలో సోమవారం నిర్వహించిన అంతర్జాతీయ నర్సుల దినోత్సవం, ఫ్లోరెన్స్ నైటెంగిల్ జయంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రపంచ ఆరోగ్య పరిరక్షణలో నర్సులు కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. కోవిడ్ సంక్షోభ సమయంలో రోగులకు విశేష సేవలందించిన నర్సులకు శాలువాలు కప్పి, ఘనంగా సన్మానించారు. కొవ్వొత్తులను వెలిగించి ఫ్లోరెన్స్ నైటెంగిల్‌కు నివాళులర్పించారు. కార్యక్రమంలో దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ రవీంద్రమోహన్, తిమ్మారెడ్డి మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, నాయకులు గంట సాయిలు, కిరణ్‌తేజ, మహేందర్, మహేశ్, ముజీబ్, గంగారెడ్డి, శంకరయ్య, నర్సులు, దవాఖాన సిబ్బంది తదితరులున్నారు.

## దూరవిద్య డిగ్రీ ఫీజు చెల్లించండి

బాన్సువాడ రూరల్, మే 12 : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ చదువుతున్న 2, 4, 6వ సెమిస్టర్ విద్యార్థులు ఈ నెలాఖరులోగా పరీక్ష ఫీజు చెలించాలని శ్రీరాం నారాయణ్‌ఖేడియా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వేణుగోపాల స్వామి సోమవారం తెలిపారు. పరీక్ష ఫీజుకు ఆన్‌లైన్‌లో లేదా కళాశాలలో నేరుగా చెల్లించవచ్చునన్నారు. 6వ సెమిస్టర్ పరీక్షలు జూన్ 20 నుంచి జూలై 25 వరకు, 4వ సెమిస్టర్ పరీక్షలు జూన్ 26 నుంచి జూలై 2 వరకు, రెండో సెమిస్టర్ పరీక్షలు జూలై 4 నుంచి 10 వరకు ఉంటాయని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## పోలీసు అధికారులకు సన్మానం



ఎల్లారెడ్డి పోలీస్‌స్టేషన్‌లో సీఐ, ఎస్సైలకు సన్మానం చేస్తున్న ముస్లిం యూత్ సోషల్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు

ఎల్లారెడ్డి రూరల్, మే 12 : ఎల్లారెడ్డి సీఐ, ఎస్సైను ముస్లిం యూత్ సోషల్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు సన్మానించారు. సోమవారం ఎల్లారెడ్డి పోలీస్‌స్టేషన్‌కు మాజీ జడ్పీటీసీ షేక్ గయాజుద్దీన్‌తో కలిసి వెళ్లిన వారు సీఐ రవీందర్‌నాయక్, ఎస్సై మహేశ్‌ను శాలువా కప్పి, పూలమాలలు వేసి సన్మానించారు. ఎల్లారెడ్డి పట్టణ నూతన ముస్లిం యూత్ సోషల్ వెల్ఫేర్ సొసైటీని ఏర్పాటుచేసినట్లు, పట్టణంలో సేవా కార్యక్రమాలు చేపట్టడానికి సొసైటీ తరపున పనిచేస్తామని వారు పోలీసు అధికారులకు తెలిపారు. కార్యక్రమంలో నూతనంగా ఎంపికైన ముస్లిం యూత్ సోషల్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు ఉన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ఎల్లారెడ్డి రూరల్/లింగంపేట/రాజంపేట్/ లింగంపేట (తాడ్వాయి), మే 12 : ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన పాపిని లింగంకు స్థానిక నాయకులు సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. సోమవారం లబ్ధిదారుని ఇంటికి వెళ్లి రూ.10వేల విలువైన చెక్కును అందజేశారు. చెక్కును అందజేసిన వారిలో ఎల్లారెడ్డి మాజీ సర్పంచ్ పప్పు వెంకటేశం, నాయకులు గాదె శ్రీను, వెంకటి, అంజయ్య, ఎడ్ల వెంకటి తదితరులున్నారు. లింగంపేట మండలంలోని శెట్పల్లి, లింగంపల్లి, మెంగారం గ్రామాల్లో నాయకులు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు శేఖర్, సంతోష్, అట్టెం శ్రీనివాస్, అన్నం సాయిలు, బాలాగౌడ్, రమేశ్, కృష్ణాగౌడ్, అంజాగౌడ్ తదితరులు పాల్గొన్నారు. తాడ్వాయి మండలంలోని ఆయా గ్రామాల్లో సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమం లో నాయకులు మల్లేశ్ రెడ్డి, రాజలింగం, శ్యాంరావు, లక్ష్మణ చారి, శ్రీనివాస్‌గౌడ్, ఘనీ, రాజు, సాయిలు, షాబుద్దీన్, సందీప్, వీరన్న పాల్గొన్నారు. రాజంపేట మండలంలోని ఎల్లారెడ్డి నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాల్లో సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసినట్లు ప్రణీత్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో నాయకు లు సల్మాన్, వినోద్ కుమార్, సాయాగౌడ్, బాల్‌రాజు, శ్రీధర్, బన్సీలాల్, సహదేవ్, శ్రీనివాస్, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

## కన్నుల పండువగా లక్ష్మీనృసింహుడి కల్యాణం



ఆలయ ప్రాంగణంలో రథాన్ని ఊరేగిస్తున్న భక్తులు

మాచారెడ్డి, మే 12 : మండలంలోని చుక్కాపూర్ అటవీ ప్రాంతంలో కొలువై ఉన్న శ్రీలక్ష్మీనృసింహస్వామి కల్యాణాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. కల్యాణాన్ని తిలకించడానికి జిల్లా నలుమూలల నుంచే కాకుండా సరిహద్దు జిల్లాలైన కరీంనగర్, సిద్దిపేట, రాజన్న సిరిసిల్లా, నిజామాబాద్ నుంచి భక్తులు తరలి వచ్చారు. అనంతరం ఆలయ ఆవరణలో భక్తులకు అన్నదానం నిర్వహించారు.

## స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

కామారెడ్డి, మే 12 : రాష్ట్రంలో డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు అకడమిక్ క్యాలెండర్‌కు అనుగుణంగా జరగకపోవడంతో విద్యార్థులందరూ అయోమయంలో ఉన్నారని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నీల నాగరాజు అన్నారు. జిల్లా కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత నెల 16వ తేదీన నుంచి ప్రారంభం కావాల్సిన 2, 4, 6 సెమిస్టర్ పరీక్షలను ప్రైవేట్ కళాశాలల ఆధ్వర్యంలో నిర్వహించలేమని తెలంగాణ యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్‌కు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. కానీ.. ఇప్పటి వరకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల కాకపోవడంతో కళాశాలలు నడవలేని స్థితిలో ఉన్నాయని అన్నారు. ఈ నెల 14వ తేదీ నుంచి పరీక్షలు జరపాలని యూనివర్సిటీ అధికారులు నిర్ణయించిన నేపథ్యంలో యూనివర్సిటీ పరిధిలోని 15 వేల మంది విద్యార్థులు పరీక్షలు యథావిధిగా జరుగుతాయోలేవోనని అయోమయంలో ఉన్నారని అన్నారు. స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని అన్నారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోష్, రాము, ప్రభంజన్, రవి, రాజేందర్, కిరణ్, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

PASSPORT LOST

I, JANGABOI BHOOMAIAH S/o. JANGABOI PEDDANNA R/o. H.No.1-110, Abbapoor (V), Navipet (M), Nizamabad (Dist) నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్ట్ నెం. F9224819 గలది. బైక్‌పై వెళ్ళుచుండగా మార్గమధ్యలో పడిపోయినది. ఎవరికైన దొరికినచో సంప్రదించు సెల్: 7780727213

NTZ-338656

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే.

ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లైయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

# వేర్వేరు కారణాలతో ఐదుగురు మృతి

కామారెడ్డి, మే 12 : మద్యానికి బానిసై, అప్పులు తీర్చలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం కామారెడ్డిలో చోటు చేసుకున్నది. పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని వాంబే కాలనీలో నివాసం ఉంటున్న జొర్రీగల ఓం ప్రకాశ్(51) గుమస్తా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మద్యానికి బానిసై, అప్పులు తీర్చలేక ఈ నెల 11వ తేదీన ఆదివారం గుర్తు తెలియని యాసిడ్ తాగి అరుస్తుండగా అది గమనించిన భార్య జొర్రీగల శకుంతల కామారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించిగా మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. భార్య శకుంతల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు.

**జీవితంపై విరక్తితో మహిళ..**

జీవితంపై విరక్తితో మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం కామారెడ్డిలో చోటు చేసుకున్నది. పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి పట్టణంలోని విద్యానగర్‌లో మంగలి శ్రీవిద్య తన సోదరి అయిన మంగలి శ్రీమతితో కలిసి అద్దెకు ఉంటున్నది. శ్రీవిద్య కల్లు తాగడం, గుట్కాలు తినడం, చెడు అలవాట్లకు బానిసై ఎక్కడ పడితే అక్కడ తిరుగుతూ ఉండేది. ఈ నెల 10వ తేదీ రాత్రి ఇంటి నుంచి బయటికి వెళ్లింది. తిరిగి తెల్లవారుజామున 3 గంటలకు ఇంటికి వచ్చి రూంలో గడియ పెట్టుకొని పడుకున్నది. ఆ తర్వాత తలుపులు కొట్టినా తీయకపోయేసరికి కల్లుతాగి పడుకున్నదనే ఉద్దేశంతో శ్రీమతి సోమవారం ఉదయం తల్లి, తమ్ముకు తెలిపింది. అందరూ వచ్చి తలుపులు పగులగొట్టి లోపలికి వెళ్లి చూసేసరికి శ్రీ విద్య చున్నీతో ఫ్యాన్‌కు ఉరేసుకొని మృతి చెందింది. శ్రీ విద్య చెడు అలవాట్లకు బానిసై, జీవితంపై విరక్తితో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లుగా శ్రీమతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు పట్టణ సీఐ తెలిపారు.

**పాముకాటుతో వ్యక్తి..**

ఎల్లారెడ్డి రూరల్ (నాగిరెడ్డి పేట్), మే 12: చేపలు పట్టడానికి వెళ్లిన వ్యక్తి పాముకాటుతో మృతి చెందిన ఘటన నాగిరెడ్డిపేట్ మండలం అచ్చయ్యపల్లి గ్రామంలో సోమవారం చోటు చేసుకున్నది. నాగిరెడ్డిపేట్ ఎస్సై మల్లారెడ్డి తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. అచ్చయ్యపల్లి గ్రామానికి చెందిన బెస్త అశోక్(47) 11వ తేదీన ఆదివారం అచ్చయ్యపల్లి గ్రామ శివారులో ఉన్న ఊర చెరువులో చేపలు పట్టడానికి వల వేసి, చెరువు ఒడ్డున పడుకున్నాడు. అంతలో బెస్త అశోక్‌ను గుర్తు తెలియని విషపుపాము కాటు వేసింది. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఎల్లారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మెరుగైన వైద్య చికిత్స కోసం కామారెడ్డి దవాఖానకు తరలించగా సోమవారం ఉదయం బెస్త అశోక్ మృతిచెందాడు. మృతుడి భార్య బెస్త భారతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

**చెరువులో పడి మరొకరు.**

బీబీపేట్(దోమకొండ), మే 12 : చెరువులో పడి ఒకరు మృతి చెందిన ఘటన దోమకొండలో చోటు చేసుకున్నది. సోమవారం ఏఎస్సై జానీబాషా తెలిపిన వివరాల ప్రకారం.. దోమకొండ గ్రామానికి చెందిన ఉసికే లక్ష్మణ్(45) ఎనిమిదేండ్ల క్రితం పెద్దపేగుకు సర్జరీ కాగా అప్పటినుంచి తరచూ నొప్పితో బాధపడుతుండేవాడు. ఈ విషయంలో ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. దోమకొండ శివారులోని కుడి చెరువులో పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఉసికే భవాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

**అనుమానాస్పద స్థితిలో ఇంకొకరూ..**

భిక్కనూరు, మే 12: దోమకొండ మండలం సంగమేశ్వర్ గ్రామానికి చెందిన నరేశ్(33) అనుమానాస్పదస్థితిలో మృతి చెందినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. నరేశ్ ఆదివారం ఉదయం ఇంటి నుంచి బయటికి వెళ్లి, స్నేహితులతో కలిసి మద్యం తాగాడు. సాయంత్రం మండలంలోని కాచాపూర్ గ్రామంలో ఓ వివాహవేడుకకు హాజరై అక్కడ భోజనం చేస్తుండగా ఒక్కసారిగా కింద పడిపోయాడు. వెంటనే స్నేహితులు కామారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## పూర్వ విద్యార్థుల సమ్మేళనం

లింగంపేట్(తాడ్వాయి), మే 12: తాడ్వాయి మండలం దేమెకలాన్ గ్రామంలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1994-95 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. విద్యా బోధన చేసిన గురువులకు సన్మానం చేశారు. కార్యక్రమంలో అప్పటి ఉపాధ్యాయులు రామాగౌడ్, కిషన్‌గౌడ్, చంద్రయ్య, వీరభద్రయ్య పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు, ఉపాధ్యాయులు

## సీసీ కెమెరాలు ప్రారంభం

రామారెడ్డి(గాంధారి), మే 12 : గాంధారి మండల ఎస్సై సూచనల మేరకు గ్రామస్తులు గ్రామంలోని రామాలయం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో గ్రామానికి రెండు, రామాలయానికి రెండు మొత్తం నాలుగు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయగా సోమవారం స్థానిక ఎస్సై ఆంజనేయులు ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## హోరా హోరీగా సాగిన కుస్తీ పోటీలు



ఐలాపూర్, కిష్టాపూర్ గ్రామాల్లో కుస్తీ పోటీల్లో తలపడుతున్న మల్లయోధులు

లింగంపేట/నస్రుల్లాబాద్, మే 12: లింగంపేట మండలం ఐలాపూర్ గ్రామంలో సోమవారం సాయంత్రం నిర్వహించిన కుస్తీ పోటీలు హోరాహోరీగా సాగాయి. దుర్గమ్మ ఆలయ ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు కుస్తీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు కామారెడ్డి, ఎల్లారెడ్డి, గాంధారి, బాన్సువాడ, పిట్లం తదితర గ్రామాలకు చెందిన మల్లయోధులు తరలివచ్చారు. కొబ్బరికాయ కుస్తీ నుంచి, నగదుతోపాటు వెండి కడియం కుస్తీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి ఆలయ కమిటీ సభ్యులు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా స్థానిక పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. లింగంపేట, ఐలాపూర్, రాంపల్లి తదితర గ్రామాలకు చెందిన ప్రజలు కుస్తీ పోటీలు తిలకించడానికి తరలివచ్చారు.

బీర్కూర్ మండలం కిష్టాపూర్ గ్రామంలో సోమవారం నిర్వహించిన కుస్తీ పోటీలు ఆకట్టుకున్నాయి. కుస్తీ పోటీల్లో తలపడేందుకు మహారాష్ట్ర, కర్ణాటక నుంచి మల్లయోధులు తరలిరావడంతో పోటీలు హోరాహోరీగా సాగాయి. పోటీలను తిలకించేందుకు బీర్కూర్ చుట్టు పక్కల గ్రామాల నుంచి ప్రజలు భారీ సంఖ్యలో వచ్చారు.

## 'ప్రజావాణి'కి అధికారులు గైర్హాజర్

లింగంపేట, మే 12 : లింగంపేట మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఆయా శాఖల అధికారులు గైర్హాజరయ్యారు. మండలంలో విధులు నిర్వహిస్తున్న అన్ని శాఖల అధికారులు హాజరుకావాల్సి ఉండగా కేవలం నాలుగు శాఖలకు చెందిన అధికారులు మాత్రమే హాజరయ్యారు. రెవెన్యూ అధికారులు భూ భారతి చట్టం పనులు చేపడుతున్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఎంపీడీవో నరేశ్, ఎంపీవో మలహరి, ఏపీఎం చామంతి శ్రీనివాస్, ఏపీవో నరేందర్ మాత్రమే మాజరయ్యారు. ప్రజావాణి కార్యక్రమానికి హాజరుకాని అధికారులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకపోవడంతో నిర్లక్ష్యం వహిస్తున్నారు.

**జుక్కల్‌లో ప్రజావాణి**

బిచ్కుంద(జుక్కల్), మే 12 : జుక్కల్‌లోని తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్ మహేందర్ కుమార్ పలు శాఖల అధికారులతో కలిసి ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో రాము, ఆర్ఐ రామారావు తదితరులు పాల్గొన్నారు.

## సమ్మెను విజయవంతం చేయాలి

బిచ్కుంద, మే 12 : ఈ నెల 20వ తేదీన నిర్వహించనున్న దేశ వ్యాప్త సమ్మెను విజయవతం చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు సురేశ్ గొండ పిలుపు నిచ్చారు. బిచ్కుందలోని ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మికులందరూ సమ్మెలో పాల్గొంటారని తెలియజేస్తూ సోమవారం వినతి పత్రం అందజేశారు. పంచాయతీ కార్మికుల మండల అధ్యక్షుడు రూప్‌సింగ్, కార్యదర్శి సాయిలు, బిచ్కుంద టౌన అధ్యక్షుడు భూమయ్య, కార్యదర్శి సుశీలబాయి, మండలంలోని పలు గ్రామ పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

## వడదెబ్బ తో ఉపాధి కూలి అస్వస్థత

లింగంపేట, మే 12 : లింగంపేట మండలం నల్లమడుగు పెద్ద తండాకు చెందిన ఉపాధి కూలి వడదెబ్బ తగిలి తీవ్ర అస్వస్థతకు గురైనట్లు తండా మాజీ సర్పంచ్ రవీందర్ నాయక్ తెలిపారు. తండాకు చెందిన గుగ్లోత్ మోతీలాల్ సోమవారం ఉదయం తండా శివారులోని రఘుపతి కుంటలో ఉపాధి పనులకు వెళ్లాడు. పనులు చేస్తున్న సమయంలో వడదెబ్బ కారణంగా అస్వస్థతకు గురయ్యాడు. దీంతో మోతీలాల్‌ను చికిత్స నిమిత్తం కామారెడ్డిలోని దవాఖానకు తరలించగా పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని ప్రైవేటు దవాఖానకు తరలించినట్లు తెలిపారు. బాధితుని పరిస్థితి విషమంగా ఉన్నట్లు ఆయన తెలిపారు.

## మహిళ ను కుటుంబ సభ్యులకు అప్పగించిన పోలీసులు

నస్రుల్లాబాద్, మే 12 : నిజామాబాద్ జిల్లా కోటగిరి మండల కేంద్రానికి చెందిన ఇందూరు స్వాతి అనే మహిళను సోమవారం నస్రుల్లాబాద్ పోలీస్ స్టేషన్‌లో వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. వివరాలు ఇలా ఉన్నాయి. నస్రుల్లాబాద్ మండల కేంద్రంలోని బస్టాండు వద్ద స్వాతి బస్సు దిగి చనిపోతాను అంటూ పరిగెత్తడంతో బస్టాండులో ఉన్న లస్సీ విక్రయించే వ్యక్తి పోలీసులకు సమాచారం అందించాడు. శ్రీనివాస్ అనే కానిస్టేబుల్ వెళ్లి మహిళను గుర్తించి నిజాంసాగర్ ప్రధాన కాలువలో పడి ఆత్మహత్య చేసుకుందామని అటు వైపు వెళ్తున్న సమయంలో మహిళకు నచ్చచెప్పి పోలీస్ స్టేషన్‌కు తరలించి తల్లి, కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ట్రేనీ ఎస్సై అరుణ్ కుమార్ తెలిపారు.

## భవన నిర్మాణానికి భూమిపూజ

కామారెడ్డి, మే 12 : జిల్లా కేంద్రంలోని ప్రాచ్యవిద్యాపరిషత్ ఓరియంటల్ హైస్కూల్ నూతన భవన నిర్మాణానికి సోమవారం భూమిపూజ చేశారు. పాఠశాల ఫౌండర్ భద్రయ్య కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. కార్యక్రమంలో పాఠశాల పూర్వ ప్రధానోపాధ్యాయుడు సిద్దిక్ హుస్సేన్, మేనేజ్‌మెంట్ అనంతకుమార్ శర్మ, పూర్వ ప్రధానోపాధ్యాయుడు మురళిరెడ్డి, పూర్వ ఉపాధ్యాయులు భాస్కర శర్మ, పూర్వ విద్యార్థి ముప్పారపు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## మాచారెడ్డిలో భారీ వర్షం

మాచారెడ్డి, మే 12 : మండల కేంద్రంతోపాటు గజ్యానాయక్‌తండా, ఘన్‌పూర్, కాకులగుట్టతండా గ్రామాల్లో సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. కొద్ది రోజుల నుంచి దంచి కొడుతున్న ఎండలకు ఉపశమనం లభించినట్లయింది. వర్షం ఒ క్కసారిగా కురియడంతో వాతావారణం చల్లగా మారిపోయింది.

## ఇద్దరు దొంగలు రిమాండ్

లింగంపేట(తాడ్వాయి), మే 12: తాడ్వాయిలో నెల రోజుల క్రితం జరిగిన చోరీ కేసుల్లో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై మురళి తెలిపారు. మండలంలోని కృష్ణాజీవాడి గ్రామ సమీపంలో సిబ్బందితో కలిసి సోమవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా ఇద్దరు యువకులు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని పట్టుకుని విచారణ చేపట్టగా తాడ్వాయిలో చోరీకి పాల్పడినట్లు అంగీకరించినట్లు తెలిపారు. మహారాష్ట్రలోని ముధ్‌ఖేడ్ తాలుకాలోని జంబలి గ్రామానికి చెందిన విశ్వనాథ్ బాపురావు చౌహాన్, నాయేగాం తాలుకాలోని లాల్వండి గ్రామానికి చెందిన విశ్వనాథ్ షిండేను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. వీరి వద్ద నుంచి పల్సర్ వాహనం, సెల్‌ఫోన్, ఇనుపరాడ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.